సాక్షి
ఆదిలాబాద్

గురువారం ; 3 ; ఏప్రిల్ ; 2025



కొరవడిన పర్యవేక్షణ!

జన్నారం అటవీ డివిజన్‌లో పర్యవేక్షణపై కరువైంది. అధికారులు సీసీటీవీ ఫుటేజీలను పర్యవేక్షించకపోవడంతో సిబ్బంది ఇష్టా రీతిన వ్యవహరిస్తున్నారు. 8లో▸



వైభవంగా కుంకుమార్చన

జిల్లా కేంద్రంలోని శ్రీరామాలయంలో బుధవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సీసీఐని పునరుద్ధరించాలి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌లోని సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని సీసీఐ సాధన కమిటీ సభ్యులు బుధవారం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కోరారు. మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్‌ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ సురేష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్రలతో కలిసి సభ్యులు పార్లమెంట్‌లోని మంత్రి చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఫ్యాక్టరీని పునఃప్రారంభించి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కమిటీ కన్వీనర్ మల్లేశ్, నారాయణ, అరుణ్‌కుమార్, నగేష్, పోశెట్టి, రమేశ్ తదితరులున్నారు.

కలెక్టరేట్ ఏవోగా వర్ణ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న వర్ణ

కైలాస్‌నగర్: కలెక్టరేట్ ఏవోగా ఎస్తేరు వర్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఏవోగా పనిచేసిన బి.రాంరెడ్డి గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆమెకు కార్యాలయ సూపరింటెండెంట్లు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని ఈ నెల 3న అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి కుర్మ కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని హస్నాపూర్‌లో గల రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి కలిసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య, మాజీ సర్పంచ్ నర్సింగ్, మాజీ వైస్ ఎంపీపీ రఘు, పంచాయతీ కార్యదర్శి లావణ్యరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతివలకు అండగా షీ టీం

ఆదిలాబాద్‌టౌన్: బాధిత మహిళలకు షీ టీం అండగా నిలుస్తుందని, కళాశాలలు, ఉద్యోగ స్థలాల్లో వేధింపులపై 87126 59953 నంబర్‌పై నిరభ్యంతరంగా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా 34 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా 3 ఈ పెట్టి కేసులు, ఒక ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. షీటీం బృందాలు 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. ఐదుగురు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా గల అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యపరుస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రెక్క లొస్తున్నాయి..



మార్చి 6న ప్రచురితమైన 'సాక్షి చర్చావేదిక' కథనం

మార్చి 9న ప్రచురితమైన కథనం

మార్చి 16న ప్రచురితమైన కథనం

- ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు
- కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్
- భవిష్యత్తులో వైమానిక శిక్షణ కేంద్రంగా..
- ఏఏఐతో కలిసి నిర్మాణాత్మకంగా ముందుకెళ్తామన్న ఐఏఎఫ్
- సామాజిక బాధ్యతగా 'సాక్షి' ముందడుగు
- 'జనం గొంతుక'కు అభినందనల వెల్లువ

జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టు ఆవశ్యకత.. ఈ ప్రాంతవాసుల మనోభావాలను 'సాక్షి' అక్షర రూపంలో ప్రతిబింబించింది. సామాజిక బాధ్యతగా ముందడుగు వేసింది. దశాబ్దాల కల సాకారం చేయాలని వారి తరపున గొంతెత్తింది. చర్చా వేదికకు శ్రీకారం చుట్టి అన్ని వర్గాలను ఆహ్వానించింది. 'రెక్కలపై ఆశలు' అంటూ మేధావులు, నిపుణులు, నాయకుల అభిప్రాయాలను పాలకుల దృష్టికి తీసుకెళ్లింది. రాజకీయాలకతీతంగా ఐక్యతా రాగం వినిపించేలా చొరవ చూపింది. 'మామ.. విమానాశ్రయం వస్తే మనకేమొస్తది..' అంటూ స్థానిక యాసలో వివరించిన కథనం అందరినీ ఆలోచింపజేసింది. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరిగింది. దీంతో చట్టసభల్లో వారు గొంతెత్తారు. శాసనసభలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ విషయాన్ని ప్రస్తావించగా.. ఎంపీ నగేశ్ సైతం పార్లమెంట్‌లో గళమెత్తారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. 'ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ తెస్తా.. ఆ బాధ్యత నాది' అంటూ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో తాజాగా ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో భాగమైన భారత వాయుసేన(ఐఏఎఫ్) నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. విషయాన్ని ఆర్‌అండ్‌బీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్రువీకరించడంతో ఈ ప్రాంతవాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. 'సాక్షి' చొరవకు జిల్లావ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. మరోవైపు 'జనం గొంతుక'గా సదా మీ సేవలోనే అంటూ అభయమిస్తోంది మన 'సాక్షి'.



ఐఏఎఫ్ నుంచి అందిన ఉత్తర్వు ప్రతి

ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర కార్యకలాపాల కోసం అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను భారత వైమానిక దళంతో సంప్రదించి పరిశీలించాం.. భవిష్యత్తులో అక్కడ శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలని భారత వాయుసేన (ఐఏఎఫ్) భావిస్తుంది.. దాన్ని పరిగణలోకి తీసుకొని మొదట ఆదిలాబాద్ నుంచి పౌర విమాన కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నాం.. ఇది ఏప్రిల్ 1న కేంద్ర ప్రభుత్వం రక్షణ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ (ఐఏఎఫ్) సనాప్ బాజీరావు రాంనాథ్ నుంచి తెలంగాణ ప్రభుత్వ రవాణా, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి అందిన ఉత్తర్వు. సివిల్ టెర్మినల్, ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్ ఆప్రాన్ ఇతర మౌలిక సదుపాయాల కోసం జిల్లా కేంద్రంలో నాడు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూచన మేరకు సర్వే చేసిన భూమిని స్వాధీనం చేసుకుంటామని భారత వాయుసేన (ఐఏఎఫ్) పేర్కొంది. ఈ ఎయిర్‌ఫీల్డ్‌ను జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్‌గా అభివృద్ధి చేయవచ్చని ఇదే ఉత్తర్వుల్లో వెల్లడించింది.

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి దీనికి సంబంధించి ఆదేశాలు వెలువడ్డాయి. ఏఏఐతో కలిసి నిర్మాణాత్మకంగా ముందుకెళ్తామని ఐఏఎఫ్ స్పష్టం చేసింది. తద్వారా రానున్న రోజుల్లో ఈ ఎయిర్‌ఫీల్డ్‌ను జాయింట్ యూజర్‌గా అభివృద్ధి పరిచి భవిష్యత్‌లో వైమానిక శిక్షణ కేంద్రంగా ఏర్పాటు చేయనున్నట్లు భావిస్తోంది.

దశాబ్దాల కల

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు అనేది నాలుగు దశాబ్దాల నుంచి ఉన్న డిమాండ్. ఎట్టకేలకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో హర్షం వ్యక్తమవుతుంది. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీని ఆనుకుని 362 ఎకరాలతో విస్తరించి ఉన్న విమానాశ్రయ మైదానం నిజాం కాలం నుంచే విమానాల రాకపోకలకు అనువుగా ఉంది. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ఏళ్లుగా డిమాండ్ ఉన్నా కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ ఉద్యమం కీలక దశకు చేరుకున్న సమయంలో మరోసారి ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు తెరపైకి వచ్చింది. విమానాశ్రయానికి అనుకూలంగా ఉందా.. శిక్షణ కేంద్రానికి అనుకూలంగా ఉందా.. అనే దానిపై 2011–12లోనే సర్వే చేశారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలంటే అదనంగా 1500 ఎకరాలకు పైగా భూమి అవసరమనే నివేదిక అప్పట్లో కేంద్రం నుంచి వచ్చింది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పట్లో కలెక్టర్‌గా ఉన్న అహ్మద్ బాబు సర్వే ల్యాండ్ శాఖతో సర్వే చేయించారు. కచ్‌కంటి, ఖానాపూర్, అనుకుంట, తంతోలి పరిధిలోకి వచ్చే గ్రామాల భూములను తీసుకోవచ్చని పేర్కొనడం జరిగింది. ఆ తర్వాత ఎయిర్‌పోర్టు ఏర్పాటు అంశం మరుగున పడినప్పటికీ అడపదడపా ఈ అంశం ప్రస్తావనకు రావడం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బడ్జెట్ సమయంలో కదలిక వస్తుందని ఆశించినా కల నెరవేరలేదు. ఎట్టకేలకు దీనిపై నిర్మాణాత్మక కార్యాచరణ మొదలు కావడంతో హర్షం వ్యక్తమవుతుంది.

వరంగల్‌లోని మామునూర్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు విషయాన్ని ఇటీవల ప్రకటించినప్పుడు ఆదిలాబాద్ అంశాన్ని ప్రస్తావించకపోవడంతో ఈ ప్రాంత వాసుల్లో నిరాశ వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' చొరవ తీసుకొని గత మార్చి 5న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో 'ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు సాధన కోసం' చర్చా వేదిక నిర్వహించింది. మేధావులు, ప్రముఖులు పాల్గొని ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కల నెరవేర్చాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అదే వేదిక పైనుంచి ఎయిర్‌పోర్టు సాధన కోసం అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ చర్చావేదిక తర్వాత ప్రధానంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరిగింది. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ బీజేపీ ప్రజాప్రతినిధులుగా ఉండడంతో అదే రోజు ఎంపీ నగేశ్ ఆదిలాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లోనూ ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించాలని అసెంబ్లీలో ఈ ప్రాంత ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రస్తావించగా.. దానికి సీఎం రేవంత్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. వరంగల్ ఎయిర్‌పోర్టును తానే తెచ్చానని, ఆదిలాబాద్‌కు కూడా సాధిస్తానని స్వయంగా చెప్పడం గమనార్హం. ఈ క్రమంలోనే ఐఏఎఫ్ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇలా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు విషయంలో 'సాక్షి' చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా చర్చావేదిక ద్వారానే కదలిక వచ్చిందని పలువురు అభినందనలు తెలిపారు.

కదిలించిన 'సాక్షి' చర్చావేదిక..

ప్రస్తుతం ఆదిలాబాద్ ఎంపీగా ఉన్న గొడం నగేశ్, గతంలో బీజేపీ ఎంపీగా వ్యవహరించిన సోయం బాపురావు, అంతకుముందు ఎంపీలుగా వ్యవహరించిన నేతలు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు విషయంలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను పలుమార్లు కలిశారు. ఎట్టకేలకు కేంద్రం నుంచి అంగీకారం రావడం, ఇటు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు కూడా ప్రత్యేక చొరవ చూపడంతో ముందడుగు పడినట్లయింది.

కేంద్ర మంత్రులను కలుస్తూ..

రక్షణ శాఖ మంత్రి పర్మిషన్ ఇచ్చారు..



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ప్రధానంగా ఇటీవల నేను రెండు సార్లు పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించాను. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రతిపాదన రావడం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆదిలాబాద్ ప్రజల పక్షాన కృతజ్ఞతలు. – **గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎంపీ**

గొప్ప అచీవ్‌మెంట్..



నరేంద్ర మోదీ ఆదిలాబాద్‌కు వచ్చివెళ్లిన తర్వాత ఏమి ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ తో పాటు పలువురు విమర్శించారు. ఇప్పుడు విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం నుంచి ప్రాథమికంగా అనుమతి లభించింది. రానున్న రోజుల్లో శిక్షణ కేంద్రం కూడా ఏర్పడుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఇక్కడ వ్యా పార, వాణిజ్య అభివృద్ధికి దోహద పడుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా వ్యవహరించడం శుభపరిణామం. ఢిల్లీ, హైదరాబాద్ స్థాయిలో విస్తృతంగా ప్రయత్నాలు చేశాను. అటు కేంద్ర మంత్రులను, ఇటు రాష్ట్రాన్ని ఒప్పించడం ద్వారా మా ఈ ప్రయత్నం సక్సెస్ అయ్యింది. – **పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే**

'సాక్షి' చొరవ అభినందనీయం..



'సాక్షి' ఆధ్వర్యంలో మార్చి 5న నిర్వహించిన చర్చావేదికలో నాతో పాటు అనేక మంది పాల్గొన్నారు. ఆ రోజు అందరం గొంతెత్తి ఈ విషయంలో ఏకతాటిపై పోరాడాలని నిర్ణయించాం. అడహక్ కమిటీని కూడా ఏర్పాటు చేశాం. ఆ ప్రయత్నంలో స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరిగింది. దీంతో పార్లమెంట్, అసెంబ్లీలో ప్రస్తావనకు రావడం, ఎయిర్‌పోర్టుకు ముందడుగు పడటం శుభపరిణామం. 'సాక్షి' చొరవను జిల్లా ప్రజలంతా అభినందిస్తున్నారు. –**ఎస్.అశోక్, ఎయిర్‌పోర్టు సాధన అడహక్ కమిటీ అధ్యక్షుడు**

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

కైలాస్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా, వివిధ శాఖల అధికారులు, గౌడ కులస్తులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.రాజలింగు, కలెక్టరేట్ ఏవో వర్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, గౌడ సంఘం ప్రతినిధులు, కులస్తులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్, బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి దళితసంఘాల నాయకులతో బుధవారం సమీక్షించారు. ఈనెల 5న జగ్జీవన్‌రామ్ జయంతి, 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నట్లుగా తెలిపారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించనున్న వేడుకలకు మున్సిపల్, పంచాయతీ, విద్యుత్, విద్య, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్సీడీవో సునీత, దళిత సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లకు 'యువ వికాసం' బాధ్యతలు

- ఐదు వార్డులకో ప్రత్యేకాధికారి

కైలాస్‌నగర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనకు గాను మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించారు. పట్టణంలోని 49 వార్డులకు గాను 49 మందిని నియమిస్తూ కమిషనర్ సీవీఎన్. రాజు ఉత్తర్వులు జారీచేశారు. ఆయా వార్డుల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్లు, ఆలయాల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు అందిన దరఖాస్తుల వివరాలను వార్డుల వారీగా ప్రత్యేకాధికారులకు అందజేశారు. ఈ మేరకు వారు బుధవారం తమ పరిధిలోని వార్డుల్లో పర్యటించి దరఖాస్తుదారు ఆధార్‌కార్డు, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు అకౌంట్ వంటి వివరాలను సేకరించారు. అలాగే ఐదు వార్డులకో ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించారు. 1నుంచి 5 వార్డులకు డీఈ తిరుపతి, 6నుంచి 10 వార్డులకు డీఈ కార్తీక్, 11నుంచి 16వార్డులకు మెప్మా డీఎంసీ శ్రీనివాస్, 17నుంచి 21వార్డులకు మేనేజర్ స్వా మి, 23నుంచి 28 వార్డులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శంకర్, 29నుంచి 34వార్డులకు ఏవో రాజ్‌కుమార్ గౌడ్, 35నుంచి 40వార్డులకు టీపీఎస్ నవీన్‌కుమార్, 41నుంచి 45 వార్డులకు సీనియర్‌అకౌంటెంట్ శ్రీనివాస్, 46నుంచి 49 వార్డులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించారు.



తాటిగూడలో దరఖాస్తుదారుల నుంచి హార్డ్‌కాపీలు స్వీకరిస్తున్న వార్డు ఆఫీసర్

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంపు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఈ నెల 30వరకు అవకాశం


కైలాస్‌నగర్: ఎల్‌ఆర్‌ఎస్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 30 వరకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దాన కిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 25శాతం రాయితీ కల్పిస్తూ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు విధించిన గడువు గత నెల 31తో ముగిసింది. అయితే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో గడువు పొడిగించింది. అయితే దరఖాస్తుదారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

రూ.8.80 కోట్ల ఆదాయం

జిల్లాలో మార్చి 31వరకు చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో కలిపి రూ.8.80 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లావ్యాప్తంగా 5,085 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. ఇందులో మున్సిపల్ పరిధిలో రూ.6.72 కోట్ల ఆదాయం, గ్రామ పంచాయతీల్లో రూ.2.08 కోట్ల ఆదాయం సమకూరినట్లు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నవీన్‌కుమార్ తెలిపారు.

ఈ సారైనా వందశాతం పూర్తయ్యేనా..

ఫేజులో 25శాతం రాయితీ కల్పించిన ప్రభుత్వం వందశాతం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో యంత్రాంగం విస్తృత ప్రచారం కల్పించింది. అయినప్పటికీ జిల్లాలో ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్–2020లో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం 22,369 దరఖాస్తులు రాగా అందులో 12,830 దరఖాస్తులకు ఫీజు చెల్లింపునకు అనుమతినిచ్చారు. అయితే అందులో కనీసం సగం మంది కూడా స్పందించలేదు. కేవలం 3,909 మంది మాత్రమే ముందుకొచ్చి ఫీజు చెల్లించారు. ఇంకా వేలల్లోనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక గ్రామ పంచాయతీల్లో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం మొత్తం 6,057 దరఖాస్తులు రాగా అందులో 4,100 దరఖాస్తులకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ చేసేందుకు అనుమతించారు. ఇందులో 1,176 మంది మాత్రమే ముందుకొచ్చారు. పంచాయతీల్లోనూ భారీగానే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం మరో నెల రోజులు అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈ సారైనా వందశాతం ప్రక్రియ జరుగుతుందా లేదా అనేది వేచిచూడాల్సిందే.



ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్–2020లో భాగంగా ఫేజులో 25శాతం రాయితీ కల్పిస్తూ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గత నెల 30 వరకు గడువు ముగిసినా ఈ నెల 30వరకు పొడిగించింది. దరఖాస్తుదారులంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. ఫీజు చెల్లించిన వారికి వెంటనే ప్రొసీడింగ్‌లను జారీ చేస్తున్నాం. ప్రక్రియపై ఎలాంటి సందేహాలున్నా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు. **– నవీన్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్**

'పది'ంతల ఆనందం

- ముగిసిన ఎస్సెస్సీ పరీక్షలు
- ఇంటిబాట పట్టిన వసతిగృహ విద్యార్థులు
- ఈ నెల 7నుంచి మూల్యాంకనం

ఆదిలాబాద్‌టౌన్: ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టి పబ్లిక్ పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తొలి పరీక్షకు గుబులు చెందిన వారు చివరి పరీక్ష ముగియడంతో కేరింతలు కొడుతూ ఇంటిముఖం పట్టారు. గతనెల 21న పరీక్షలు ప్రారంభం కాగా బుధవారంతో ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ఆయా వసతిగృహాల్లో ఉండి చదువుకున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు వచ్చి వారిని తీసుకెళ్లారు. బస్టాండ్ ప్రాంతం ప్రయాణికులతో కిటకిటలాడింది. పరీక్షలు ముగియడంతో విద్యాశాఖ అధికారులు మూల్యాంకనం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 7 నుంచి 15 వరకు జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో స్పాట్ నిర్వహించనున్నారు. వివిధ జిల్లాల నుంచి లక్ష 74వేల జవాబు పత్రాలు మూల్యాంకనానికి వచ్చాయి. వాల్యూయేషన్ చేసేందుకు ఉపాధ్యాయులకు విధులు కేటాయించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, గురువారం జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.



పరీక్ష రాసి ఆనందంతో బయటకు వస్తున్న విద్యార్థినులు

కొరవడిన పర్యవేక్షణ!

- అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు
- తూతూ మంత్రంగా ఉన్నతాధికారుల పరిశీలన
- విధుల్లో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న సిబ్బంది

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు తూతూ మంత్రంగా మారాయి. సీసీకెమెరాల నిర్వహణ చేపడుతున్నా ఉన్నతాధికారులు సీసీఫుటేజీలను పర్యవేక్షించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది సంతకం చేసిన తర్వాత అక్కడే 24 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కానీ సంతకం చేసిన తర్వాత తమ సొంత పనుల కోసం వెళ్తున్నట్లు సమాచారం ఉంది. చెక్‌పోస్టుల వద్ద బీట్, సెక్షన్ అధికారులతో పాటు వాచర్లు కూడా విధులు నిర్వహిస్తుంటారు. అయితే వాచర్లకు బాధ్యతలు అప్పగించి అక్కడ డ్యూటీ చేసే ఇతర సిబ్బంది సొంత పనుల కోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇలా పలు చెక్‌పోస్టుల్లో జరుగుతుండగా ఇటీవల ఉన్నతాధికారి గమనించి హెచ్చరించినట్లుగా సమాచారం. గతంలో పని చేసిన ఎఫ్‌డీవో మాధవరావు సీసీకెమెరాల్లోనే సిబ్బంది పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హెచ్చరికలు జారీ చేయడంతో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదు. కానీ ప్రస్తుతం ఉన్నతాధికారులు సీసీకెమెరాలను పట్టించుకోకపోవడంతో సిబ్బందిపై పర్యవేక్షణ లేక ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

మూడేళ్ల క్రితం ఏర్పాటు..

జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు మూడేళ్ల క్రితం చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీకెమెరాల ఏర్పాటుతో చెక్‌పోస్టుల వద్ద జరుగుతున్న వాహనాల తనిఖీలు, రాత్రి పూట వాహనాల ప్రవేశంతో పాటు చెక్‌పోస్టుల వద్ద పని చేస్తున్న సిబ్బంది పనితీరు పర్యవేక్షించేవారు. డివిజన్‌లోని ఇందన్‌పల్లి, కలమడుగు, తపాలపూర్ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు.

ఎన్నో ప్రయోజనాలు..

ప్రధాన రహదారిపై గల అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధాన రహదారిపై స్మగ్లింగ్‌కు తగ్గిపోవడంత పాటు అనుమానిత వాహనాలను గుర్తించే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో ఈ సీసీ కెమెరాలు సహకరిస్తాయి. ఇప్పటి వరకు పలు కేసుల పరిష్కారంలో పోలీసులు అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను పరిశీలించారు.



ఇందన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరా

నిత్యం పర్యవేక్షిస్తున్నాం..



జన్నారం డివిజన్‌లో నిఘా కోసం అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గతంలో కొంత పర్యవేక్షణ కొరవడింది. కానీ నేను విధుల్లో చేరినప్పటి నుంచి సీసీకెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సిబ్బంది పనితీరు కనిపెడుతున్నాం. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం.

– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

క్లుప్తంగా

రైతుపై అడవిపంది దాడి



గాయాలతో కిషన్

జన్నారం: అడవి పంది దాడిలో మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు చిరివేణి కిషన్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం పొనకల్ గ్రామ శివారులోని పంట పొలాలకు కిషన్ నీరు పెట్టేందుకు వెళ్లగా అడవిపంది ఒక్కసారిగా దాడి చేసింది. భయంతో కిషన్ కేకలు వేయగా సమీపంలో ఉన్న మరో వ్యక్తి రావడంతో అడవి పంది పారిపోయింది. దాడిలో కిషన్ కుడి భుజం, కుడి కన్ను కింద గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు జన్నారం ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

పాత గోదాంలో అగ్నిప్రమాదం

భైంసాటౌన్: పట్టణంలోని ఈసేవా కాంప్లెక్స్ సమీపంలో గల పాత గోదాంలో బుధవారం మంటలు చెలరేగాయి. గోదాం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండగా చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రమాదవశాత్తు చెత్తకు నిప్పంటుకోగా దట్టమైన పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

పాఠశాలలో చోరీకి యత్నం



తరగతి గదిని పరిశీలిస్తున్న ఎస్సై

కడెం: మండలంలోని పెద్దూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలకు గత మూడు రోజులుగా సెలవులు ఉన్నాయి. సెలవు రోజుల్లో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని రెండు తరగతి గదుల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. పాఠశాలలో విలువైన సామగ్రి లేకపోవడంతో దొంగలు ఎక్కడివి అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. కాగా హెచ్‌ఎం ఫిర్యాదుతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి బుధవారం పాఠశాలను పరిశీలించారు.

కీచక ఉపాధ్యాయులపై కేసు నమోదు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గత ఫిబ్రవరిలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన గణిత ఉపాధ్యాయుడు ఆలూరి మనోహర్ రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు సాయిని మోహన్‌రావులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసుతో పాటు బుధవారం అదనంగా ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ 1989ను నమోదు చేశారు. విచారణ అధికారిగా ఉన్న నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు పరారీలో ఉండగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మార్చి 8న మనోహర్‌రెడ్డిని, ఏప్రిల్ 1న మోహన్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ శివారులో పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న వారిలో ముగ్గురు పారిపోగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. రూ. 3,720 నగదు, రెండు మొబైల్ ఫోన్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంగిపల్లిలో వన్యప్రాణుల వేట

- ఉచ్చుకు బలైన చుక్కల దుప్పులు
- మాంసం విక్రయానికి యత్నం
- పట్టుకున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: అటవీప్రాంత సమీపంలో పంట పొలాలను కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చుకు వన్యప్రాణులు బలయ్యాయి. ఉచ్చుకు రెండు చుక్కల దుప్పులు మృత్యువాతపడగా వాటి మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. జైపూర్ మండలం గంగిపల్లి గ్రామ శివారులో గల పంట పొలాల్లో రైతులు అమర్చిన విద్యుత్ తీగలకు రెండు చుక్కల దుప్పులు మృతిచెందాయి. మాంసాన్ని విక్రయించేందుకు చిన్న ముక్కలుగా కోస్తుండగా గంగిపల్లి గ్రామానికి చెందిన పాలమాకుల శ్రీనివాస్‌రెడ్డి, గూడపాపన్నలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్ తెలిపారు. ఇద్దరిపై వన్యప్రాణుల చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు.



చుక్కల దుప్పి మాంసంతో నిందితులను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

లాడ్జిలో దాడికి పాల్పడిన వ్యక్తులు అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ గార్డెన్ సమీపంలోని ఓ లాడ్జిలో ఈనెల 1న రాత్రి జరిగిన దాడి కేసులో బుధవారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఉషకోయల తరుణ్ తన బంధువులు శ్రావణ్, పర్వతాలు, శ్రీకాంత్, రేవంత్‌లు లాడ్జిలో రూమ్ తీసుకొని శ్రావణ్ కుటుంబ సమస్యపై మాట్లాడుకుంటున్నారు. ఇదే సమయంలో రేవంత్‌కు తెలిసిన వ్యక్తి అశోక్‌రోడ్‌కు చెందిన మురుమూరు సందీప్ తన స్నేహితులు తిగుళ్ల శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లు రేవంత్‌తో పాటు ఇతరులపై దాడిచేశారు. పాత గొడవల కారణంగా సందీప్ రేవంత్‌పై దాడి చేయగా శ్రీకాంత్, తరుణ్, పర్వతాలుకు తీవ్ర గాయాలయ్యాయి. తరుణ్ ఫిర్యాదు మేరకు సందీప్, శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లపై కేసు నమోదు చేయగా శివకుమార్, సాకేత్, అఫ్రోజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిఖిల్, వివేక్, అచ్యుత్, సందీప్‌లు పరారీలో ఉన్నారన్నారు.



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

న్యాయం చేయాలని గంగపుత్రుల నిరసన

నిర్మల్‌చైన్‌గేట్: లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ డబ్ల్యూకు చెందిన గంగపుత్ర కులానికి చెందిన 10 కుటుంబాల వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుల సంఘానికి సంబంధించిన లెక్కలు అడిగినందుకు సంఘం అధ్యక్షుడు పడగేల మహిపాల్ తమ కుటుంబాలను కుల బహిష్కరణ చేశారన్నారు. గత పది నెలలుగా కలెక్టర్, ఎస్పీలను కలిసి సమస్య పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి వచ్చిన పోలీసులు కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇచ్చి కులంలో చేరాలని సలహా ఇచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, హెచ్ఆర్సీ సంఘం అధ్యక్షుడు సురకంటి ఎల్లారెడ్డి, బాధిత గంగపుత్రులు పుట్టి భీమన్న, పుట్టి ఎర్రన్న ఉన్నారు.



నిరసన తెలుపుతున్న గంగపుత్ర కులస్తులు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

కోటపల్లి: మండలంలోని కొండంపేట గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం కూలీలపై బుధవారం తేనెటీగలు దాడి చేశాయి. కూలీలు అటవీ ప్రాంతంలో పని ప్రదేశానికి వెళ్తుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో పరుగులు తీశారు. తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు తలోవైపు పరుగుపెట్టారు. దాడిలో గ్రామానికి చెందిన లింగయ్య, బానయ్య, రాజు, సమ్మక్క, అంకమ్మ, బాపు స్వలంగా, పి.స్వరూప తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి బాధితులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యుడు సత్యనారాయణకు సూచించారు. దాడిలో కూలీల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



చికిత్స పొందుతున్న కూలీలు

హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు

సోన్/నిర్మల్‌టౌన్: సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఏడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.3000 జరిమానా విధిస్తూ నిర్మల్ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం భీమన్న ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. 12, ఏప్రిల్, 2023న మధ్యాహ్నం గ్రామంలోని హోటల్‌లో కూర్చున్నాడు. అదే గ్రామానికి చెందిన కుడుకల పోశెట్టితో హోటల్ వద్ద గొడవ జరిగింది. దీంతో పోశెట్టి పక్కన ఉన్న పగిలిన బీర్‌సీసాతో భీమన్నను పొడిచాడు. వెంటనే అక్కడున్న వారు అడ్డుకోగా విషయం తెలుసుకున్న భార్య గంగామణి చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం సోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ రమణారావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేశారు. దీంతో జడ్జి పోశెట్టికి 7 సంవత్సరాల జైలుశిక్ష, రూ.3000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

భార్య, అత్తపై దాడి.. వ్యక్తి అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

తాండూర్: భార్య, అత్తను చితకబాది గాయపర్చిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామపంచాయతీ కొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాగం మల్లేశ్ గతనెల 16న మద్యం తాగి భార్య లావణ్యతో గొడవ పడ్డాడు. లావణ్యపై దాడి చేయడానికి సిద్ధపడగా అత్త రాజు అడ్డుపడింది. కోపోద్రిక్తుడైన మల్లేశ్ గరిటెతో ఇరువురు తలలపై బలంగా కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

నేరడిగొండ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిర్మల్ వైపు గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం బందం ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు చేపట్టగా నేరడిగొండ మండలం వాంకిడి గ్రామానికి చెందిన షేక్ మజార్, నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ ఇమ్రాన్ అనే ఇద్దరు వ్యక్తుల వద్ద 150 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని విచారించగా నేరడిగొండ మండలంలోని ధన్నూర్(డి) గ్రామానికి చెందిన కాటరే తారాసింగ్ వద్ద నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు తేలిందన్నారు.

వ్యక్తి రిమాండ్

బజార్‌హత్నూర్: గంజాయితో ఉన్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మోర్కండి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి పోలీస్‌పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గులాబ్‌తండా గ్రామపంచాయతీ పరిధి ఇంద్రనగర్ గ్రామానికి చెందిన ఆడే రాజ్‌కుమార్ అనుమానాదస్పదంగా కన్పించాడు. అతడిని తనిఖీ చేయగా అతని వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. బుధవారం బోథ్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిరసనలో పాల్గొన్న ఎంపీ నగేశ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సమీప ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట బుధవారం బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న జీహెచ్‌ఎంసీ మేయర్



మేయర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని బుధవారం జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేయర్‌కు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మహాపోచమ్మ దేవాలయం, పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట నాయకులు గడ్డం అరవింద్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

జొన్న పంట దగ్ధం



దగ్ధమైన జొన్న పంటను చూపుతున్న రైతు

ముథోల్: ముథోల్‌కు చెందిన కోరి యోగేశ్‌కు చెందిన జొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... యోగేశ్ 10 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేశాడు. చేతికొచ్చిన జొన్న పంటను ఒకే చోటకు చేర్చి కుప్పలుగా పోశాడు. ఇటీవల వర్షం కురవడంతో రక్షణ కోసం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచాడు. బుధవారం ఉదయం చేనుకు వచ్చే సరికి పంట కుప్పలు కాలిపోయి ఉన్నాయి. పంట కుప్పలు దగ్ధం కావడానికి గల కారణం ఎంటో తెలియడం లేదని బాధిత రైతు వాపోతున్నాడు. అప్పులు తెచ్చి పంట సాగు చేశానని అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

తెల్లకల్లు షాపుపై పోలీసుల దాడి

బేల: మండలంలోని జంగుగూడ (సైద్‌పూర్)లో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న తెల్లకల్లు షాపుపై మంగళవారం రాత్రి జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, బేల ఎస్సై దివ్యభారతిలు సిబ్బందితో కలిసి దాడి చేశారు. తెల్లకల్లు షాపులోని 400 లీటర్ల తెల్లకల్లును ధ్వంసం చేసి, రూ.3వేల నగదును సీజ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. షాపు యజమాని బేలకు చెందిన సత్యనారయణ్ గౌడ్, షాపు నిర్వాహకుడు తుకారాంతో పాటు అక్రమషాపు నిర్వహణకు రూ.12లక్షలకు అనుమతి ఇచ్చిన వీడీసీ చైర్మన్ ఆత్రం రాముడుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీస్

బాసర: గోదావరి నదిలో పిల్లలతో కలిసి దూకేందుకు యత్నించిన వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా బోయగల్లికి చెందిన కోమటి గంగప్రసాద్, భార్య లక్ష్మి నిజామాబాద్‌లోని బట్టల దుకాణంలో పని చేస్తుంటారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు వర్షిణి, రక్షిత ఉన్నారు. కాగా కుటుంబ సమస్యల కారణంగా తన ఇద్దరు పిల్లలను తీసుకుని గంగప్రసాద్ బుధవారం బాసర మండల కేంద్రంలోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి హుటాహుటిన వారి వద్దకు చేరుకున్నాడు. ఆత్మహత్యకు యత్నిస్తున్న గంగప్రసాద్‌ను అతని ఇద్దరి పిల్లలను దగ్గరికి తీసుకొని ఓదార్చాడు. గంగప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. కాగా చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడిన కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను ఎస్సై గణేశ్, ఇతర సిబ్బంది అభినందించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్

రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల వాసి మృతి



విజయ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ భర్త విజయ్ (53) బుధవారం హైదరాబాద్ రింగురోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం విజయ్ తన అన్న కూతురు సోనిని అమెరికా పంపించేందుకు ఈనెల1న అన్నయ్య రాములు, వదిన విజయ, మరో స్నేహితుడితో కలిసి తన కారులో వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా రింగ్‌రోడ్డుపై కంటైనర్ లారీ ఢీకొనడంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నయ్య రాములుకు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా రాములు భార్య విజయ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోనే చికిత్స పొందుతోంది. విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర

నార్నూర్: రాజ్యాంగ పరిరక్షణకే జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని పూసిగూడ గ్రామం నుంచి జిల్లా కోఆర్డినేటర్ ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌తో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో నియంతృత్వ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రజలతో, కార్యకర్తలతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, మాజీ సర్పంచ్ బానోత్ గజానందు నాయక్, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, మహిళ నాయకురాలు బానోత్ ప్రణీత, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ కోర్వేళ్ల మహేందర్, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు నసీర్ తదితరులు ఉన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న ఆత్రం సుగుణ

అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు



జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో ఎలాంటి వసూళ్లకు పాల్పడొద్దని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వీడీసీలకు ఎలాంటి అధికారిక గుర్తింపు లేదన్నారు. ఈ కమిటీలు వసూళ్లకు పాల్పడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బేల మండలం సాంగిడి, జైనథ్ మండలం సాంగ్వి గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసిన వీడీసీలపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్‌శాఖ అనుమతులతోనే మద్యం షాపులు నిర్వహించుకోవాలని, వీడీసీలు అనుమతులు ఇవ్వడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో ఐదేళ్ల బాబు మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన గౌరాల రాజేశ్వరి మనమడు ఆడుకుంటున్న సమయంలో అదే కాలనీకి చెందిన ఆకాశ్ అనే వ్యక్తి బాబుకు కూల్‌డ్రింక్ కొనిచ్చి మెడలోని గ్రాము బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపులపై దాడులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో గల బెల్ట్‌షాపుల్లో బుధవారం తనిఖీలు చేసినట్లు సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అనుమతులు లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులు సుందరయ్యనగర్‌కు చెందిన జల్లార్‌పూర్‌వార్ సుధాకర్, గులేందవ ఇంద్ర, బోయపల్లి అభి యాదవ్, శ్రీరామ్ కాలనీకి చెందిన తలకోకుల భూమన్నలపై కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం విలువ దాదాపు రూ.15370 ఉంటుందని తెలిపారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్‌నగర్‌కు చెందిన లక్ష్మి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి మహారాష్ట్రలోని బోరికి వెళ్లగా, ఇంట్లో ఆమె పిల్లలు ఉన్నారు. రాత్రి సమయంలో ఇంటికి తాళం వేసి పక్కింట్లో నిద్రపోయారు. ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగిలి ఉంది. ఇంట్లో ఉన్న 3 గ్రాముల బంగారంతోపాటు సిల్వర్ చైన్ అపహరణకు గురైంది. వాటి విలువ రూ.16వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.